# రాజన్న ఆలయ విస్తరణకు శ్రీకారం

- ఉన్నత అధికారులతో హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక సమావేశం
- హాజరైన ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్
- జులై నుంచి ఆలయ విస్తరణ పనులు ప్రారంభం
- 15న తుది ప్రణాళిక తయారీకి వేములవాడ రానున్న ఉన్నతాధికారులు



**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ప్రజా భవన్ లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారము శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఆలయ విస్తరణ పనులపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఓఎస్డీ సోమరాజు సమక్షంలో సమావేశం నిర్వహించి కమిషనర్ శ్రీధర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలను చర్చించి పలు నిర్ణయాలను తీసుకున్నట్లు తెలిపారు.వారు మాట్లాడుతూ ఆర్కిటెక్ట్ చే తయారు చేయబడిన ఆలయ విస్తరణ పనులకు సంబంధించిన నమూనాను పరిశీలించి కొన్ని మార్పులు, చేర్పులు రెండు రోజుల్లోగా చివరి ప్లాన్ తయారు చేయవలసిందిగా ఆర్కిటెక్ట్ ను ఆదేశించినారు. ఈ పనులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ శాఖ మరియు దేవాదాయ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.

### 15న వేములవాడ పర్యటన

ఈ నెల 15న కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆర్అండ్‌బీ అధికారులతో పాటు కలిసి వేములవాడ ఆలయ పర్యటన చేసేందుకు నిర్ణయించారు. క్షేత్రస్థాయి పర్యటన చేసిన తదుపరి చివరి ప్లాన్ పైన తగు సూచనల విషయములో మరోసారి శృంగేరీ పీఠం వారి వద్దకు వెళ్ళుటకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 20 తేదీలోపు పీఠాధిపతి సూచనలు తీసుకొని 21న టెండరు ప్రక్రియ చేపట్టుటకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. రాజన్న దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు రాజన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బంది కలిగించకుండా జూన్ 15 నుంచి భీమేశ్వర స్వామి ఆలయములో భక్తులకు దర్శనములు, అభిషేకములు, అన్నపూజాలు, కోడె మొక్కుబడి జరిపించుటకు నిర్ణయించినట్లు తెలిపారు. జూన్ 10లోపు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయము వద్ద భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ల ఏర్పాటు, వేద పాఠశాల ముందు స్థలంలో శృంగేరీ శంకర మఠం ఖాళీ స్థలములో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి అభిషేకాలు, నిత్య కల్యాణం మొదలగు నిర్వహించేందుకు వీలుగా తగు ఏర్పాట్లు చేసేందుకు ఆలయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాజేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ (సివిల్), ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ శ్రీనివాసరావు దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ స్థపతి, దుర్గాప్రసాద్, ఆలయ ఈవో కే. వినోద్, టీ. రాజేష్, రఘునందన్, శరత్ కుమార్, సురేశ్ అర్చకులు దేవస్థానం వారు పాల్గొన్నారు.



## పోషణ పక్షం కార్యక్రమం

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-2లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అధికారులు పోషన్ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్ గంగ లక్ష్మి మాట్లాడుతూ పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని ఈ నెల 4 నుంచి 22 వరకు 15 రోజులు అంగన్వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించబడుతాయన్నారు. ఇందులో భాగంగా మొదటి 1000 రోజుల ప్రాముఖ్యత అనగా గర్భవతి నుంచి మొదలుకొని రెండేళ్ల పిల్లల వరకు పిల్లల పర్యవేక్షణ, పెరుగుదలతో పాటు గర్భిణులు తీసుకునే పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, బాలింత సంరక్షణ వంటి విషయాలను తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కే. సువర్ణ, అంగన్వాడీ టీచర్ నర్మద, ఆయాలు పిల్లలు పాల్గొన్నారు.


### ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా జాయింట్ సెక్రటరీగా

## మేరుగు బాబు నియామకం



**ప్రజానావ, కోనరావుపేట:** జాతీయ మానవ హక్కుల కమిటీ జాతీయ చైర్మన్ డా. మహమ్మద్ యాసిన్, రాష్ట్ర చైర్మన్ బద్దిపడిగేలా శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు మేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాజన్న సిరిసిల్ల జిల్లా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా జనరల్ సెక్రటరీగా కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన మెరుగు బాబును నియమించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెరుగు బాబు మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించి అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలోని చైన్ స్నాచింగ్






**ప్రజానావ, కాగజ్ నగర్ :**పట్టణంలోని కాపువాడలో దొంగలు హల్చల్ చేశారు. మంగళవారం ఉదయం ఇంటి బయట మహిళ ముగ్గువేస్తున్న క్రమంలో మెడలోని బంగారు చైన్ను ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లారు. ముందుగా మహిళను పూలు కోసుకుంటామని అడిగి పూలు తెంపుతున్నట్టు నటించి ఒక్కసారిగా మెడలోని గొలుసును లాక్కుని పారిపోయారని బాధితురాలు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**ప్రజానావ, కౌటాల:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి అట్టహాసంగా కౌటాల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్,ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు తో కలిసి ప్రారంభించారు. కౌటాల మండలానికి చెందిన కొందరు పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ కౌటాల మండల ప్రజలకు మరింత చేరువ ఉండేందుకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని మరింత నూతన ఉత్సాహంతో పనిచేయాలని పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడం గణపతి, చింతలమానం పెళ్లి తాజా మాజీ ఎంపీపీ దుబ్బుల నాన్నయ్య,కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూకు 'భూ భారతి' కొత్త ఊపిరి




### రెవెన్యూ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

**ప్రజానావ, ఖైరతాబాద్:** భూ భారతి చట్టం రెవెన్యూ వ్యవస్థకు కొత్త ఊపిరి పోసిందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వీ. లచ్చిరెడ్డి అన్నారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరగడంతో పాటు రెవెన్యూ సేవలు, పౌర సేవలు చేరువవుతాయన్నారు. రెవెన్యూ ఉద్యోగులు నిరుద్యోగులకు భరోసా లభించిందన్నారు. గ్రామీణ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ ఆర్డీవో కె.రామకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం అవుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులు కూడా పునరేకీకరణ కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలోకి జీపీవోలుగా వస్తున్న పూర్వపు వీఆర్వోలు, వీఆర్ఏలు సర్వీసువరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం జీపీవో పోస్ట్ కొత్తగా క్రియేట్ చేసిందని, అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగానే జీపీవోలకు కూడా పదోన్నతులు వస్తాయన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సమీప భవిష్యత్తులోనే ఓ భరోసా దొరుకుతుందన్నారు. ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు. కానీ త్వరలోనే అమల్లోకి రాబోతున్న భూ భారతి చట్టంలో తహశీల్దార్లకు ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుంచి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని లచ్చిరెడ్డి తెలిపారు.

### పెండింగ్ బిల్లులపై సానుకూలం

ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఇటీవల జేఏసీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కలిసి వివరించినట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ తో పాటు రాష్ట్ర స్థాయిలో అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ అనివార్యతను వివరించడం జరిగిందన్నారు. తమ వినతిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. 61ఏళ్లు పైబడిన వీఆర్ఏలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలను చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గంతో పాటు రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ సహా ప్రభుత్వ పెద్దలలందరి సహకారంతో అనతి కాలంలోనే అనేక చారిత్రిక విజయాలను తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ సాధించడం జరిగిందన్నారు. ఆత్మీయ సమ్మేళన సభలో ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న ఆటాపాటలతో సభికులను ఉర్రూతలూగించాయి. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం కోశాధికారి వెంకట్ రెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ అధ్యక్షుడు చల్ల శ్రీనివాస్, టీజీజీఏ సెక్రటరీ జనరల్ సెక్రటరీ పూల్ సింగ్, టీజీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్శనం గౌడ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. రాధ, డీఆర్వో వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**ప్రజానావ, కోనరావుపేట:** లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బ్యాంకు అధికారులు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ కోనరావుపేట బ్రాంచ్ మేనేజర్ సంజీవ్, బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వెంకట రమణ, విద్యార్థులకు బ్యాంకింగ్, వివిధ రకాల ఖాతాలు, బ్యాంకులు అందించే రుణాలపై వివరించారు. డబ్బు ఆదా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అవసరాలు, కోరికలు ఏమిటి.. వాటికి ఎలా ప్రాధాన్యత ఇవ్వాలో వివరించారు. బీమా, పెన్షన్ అనే భావనల గురించి విద్యా రుణం గురించి విద్యార్థులకు తెలిపారు. ఆన్‌లైన్ మోసాలపై వివరించి ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే, 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌తో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను సందర్శించవచ్చని నివేదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



